క్లుప్తంగా

జార్జిరెడ్డి వర్ధంతి సభ



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు చేసిన జార్జిరెడ్డి వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐఎంఎల్ జిల్లా నాయకులు గంగాధర్ మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం ఉద్యమాలు చేస్తూ వారిని చైతన్య పరిచిన నాయకులు జార్జి రెడ్డి అని కొనియాడారు. నాయకులు సాయరెడ్డి, దేవన్న, దేవరాజ్, శ్రీను, లత, రాజమణి, దేవమ్మ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రాన్ని సర్పంచ్ ఏనుగు పద్మ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేశ్వర్, కార్యదర్శి నర్సయ్య, నాయకులు మేడపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద భీమ్ ట్రస్టు ఆధ్వర్యంలో మెడిసిన్ సీటు సాధించిన తలారి కెవిన్ రాజ్‌ను శుక్రవారం పూలమాల, శాలువాతో సన్మానించి రూ. 25 వేల నగదు పురస్కారం అందజేశారు. ఆర్మూర్‌లో నివాసముండే తుమ్మ గోదావరి, కిషన్ దంపతుల కుమారుడు కెవిన్‌రాజ్ 2022–23 విద్యాసంవత్సరంలో వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీటు సాధించాడు. దాంతో కెవిన్ రాజ్‌ని భీమ్ ట్రస్టు తరపున ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు, ఏటీవో రాములు, ట్రస్టు వ్యవస్థాపకులు పర్స లింబాద్రి సన్మానించారు.

బాధిత కుటుంబానికి చేయూత



మాక్లూర్: రెండు కాళ్లు కోల్పోయి మంచానికే పరిమితమైన అడవి మామిడిపల్లికి చెందిన మంగళి గంగాధర్ అనే యువకుడిని శుక్రవారం ఆర్‌ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ సుచరితా రెడ్డి పరామర్శించారు. తక్షణ సహాయంగా రూ.10 వేల నగదు అందించి ఆస్పత్రిలో తగిన వైద్యం చేయించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అందుకు అయ్యే వైద్య ఖర్చులను కూడా భరిస్తామని హామీ ఇచ్చారు. మంగళి గంగాధర్ బ్రతుకు దెరువు కోసం దుబాయ్ వెళ్లి అక్కడ కెమికల్ ఫ్యాక్టరీలో పని చేస్తుండగా అనారోగ్యానికి గురై తిరిగి వచ్చాడు. వచ్చిన అనంతరం రెండు కాళ్లూ స్పర్శ లేకుండా పోయి మంచానికే పరిమితమయ్యాడు. తల్లిదండ్రులు స్తోమత మేరకు ఆస్పత్రిలో వైద్యం చేయించి ఇక తమతో కాదని విరమించుకున్నారు. విషయం తెలిసిన ఆర్‌ఆర్ ఫౌండేషన్ తగిన వైద్యం చేయించటానికి ముందుకు రావటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

బీజేపీ ఆర్థిక సాయం




కమ్మర్‌పల్లి: చౌట్‌పల్లికి చెందిన గుండోజీ రవి అనే వ్యక్తి అనారోగ్యానికి గురికాగా, వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక బీజేపీ నాయకులు శుక్రవారం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కొమ్ముల సంతోష్‌రెడ్డి, కుంట భూమారెడ్డి, కొత్తపల్లి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. అధికారులు నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

శిథిలావస్థలో పశువుల ఆస్పత్రి

- 80 ఏళ్ల క్రితం వర్నిలో భవన నిర్మాణం
- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి



స్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటికి తేలిన దృశ్యం



వర్నిలోని పశువుల ఆస్పత్రి భవనం

వర్ని: నిజామాబాద్ జిల్లాలో పాడి ఉత్పత్తిలో వర్ని మండలం ప్రథమ స్థానంలో ఉంది. అలాంటి వర్నిలో పాడి పశువులకు చికిత్స అందించే ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. నేడో రేపో కూలిపోవడానికి ఆస్పత్రి భవనం సిద్ధంగా ఉంది. 80 సంవత్సరాల క్రితం గ్రామ రైతులు విరాళాలు పోగు చేసి పశువుల ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. భవనం స్లాబు పెచ్చులు ఊడి ఇనుప రాడ్లు బయటకు వచ్చి ఎప్పుడు పడిపోతుందోనని ఆస్పత్రి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వర్షం పడితే భవనం స్లాబ్ నుంచి నీరుకారి ఆస్పత్రి మొత్తం జలమయమవుతోంది. ఆస్పత్రిలో ఉన్న మందులు, ఇతర పరికరాలు నీటితో తడిసిపోతున్నాయి. ఐదారు సంవత్సరాల నుంచి శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో మరో భవనం నిర్మించాలని రైతులు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుకు రాకపోవడం శోచనీయం.

ప్రధాన ఆదాయం పాడి పరిశ్రమపైనే..

వర్ని, సత్యనారాయణ పురం, కోటయ్య క్యాంప్, అంతాపూర్, పొట్టిగుట్ట, సేవాలాల్ తండా, మల్లారం, గంగారెడ్డి నగర్ గ్రామాల పశువులు వర్ని ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స చేయిస్తారు. ఆస్పత్రి పరిధిలో ఉన్న గ్రామాల రైతులు ప్రధానంగా వ్యవసాయం, పాడిపైనే జీవనం సాగిస్తున్నారు. వర్నిలో సుమారు 18 వందల పాడి పశువులు ఉండగా ప్రభుత్వ డెయిరీ విజయాతో పాటు మరో 15 ప్రైవేటు డెయిరీలు ఉన్నాయి. ఇక్కడి రైతులు గుజరాత్, హర్యానా, మహారాష్ట్ర నుంచి మేలు జాతి పశువులను తీసుకువచ్చి పాల వ్యాపారంతో పాటు పశువుల వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వర్ని ఆస్పత్రి విషయంలో చర్యలు తీసుకొని పాడి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు.

అలా చేస్తేనే నిధులిస్తామంటున్నారు



భవనం శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు పడిపోతుందో అన్న భయం ఏర్పడింది. నూతన భవనాన్ని నిర్మించాలని అధికారులను కోరితే ఉన్న స్థలాన్ని పశుసంవర్ధక శాఖపై రిజిస్ట్రేషన్ చేయిస్తే నిధులు మంజూరు చేయిస్తామని అధికారులు చెప్పారు. స్పీకర్ శ్రీనివాస్ రెడ్డిని కోరగా పశుసంవర్ధక శాఖ ద్వారానే నిధులు మంజూరు రావాల్సి ఉంటుందని వెల్లడించినట్లు డి.రాజు తెలిపారు. ఏది ఏమైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇరువురి సమన్వయంతో నూతన ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాం. – రాజు, అధ్యక్షుడు, వర్ని పాల ఉత్పత్తిదారుల సంఘం

దళారులను నమ్మి మోసపోవద్దు



నందిపేట: వెల్మల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్



కోటగిరిలో .. జెడ్పీటీసీ శంకర్



కమ్మర్‌పల్లిలో.. సొసైటీ చైర్మన్ సామ బాపురెడ్డి



నీలాలో .. జెడ్పీటీసీ విజయ, సర్పంచ్ లలిత

జిల్లాలో పలు చోట్ల శుక్రవారం సహకార సంఘాల ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. వరి ఏ– గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2060, బీ–గ్రేడ్ ధాన్యానికి రూ.2040 మద్దతు ధర ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు వివరించారు. – నందిపేట/రుద్రూర్/కమ్మర్‌పల్లి/బోధన్/వేల్పూర్/మాక్లూర్



రామన్నపేట్‌లో.. డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్ రెడ్డి



డీకంపల్లిలో.. మాక్లూర్ సొసైటీ చైర్‌పర్సన్ లక్ష్మి

జిల్లా సాధనలో యువత భాగస్వాములు కావాలి



బోధన్‌లో కోర్టు ఎదుట దీక్ష చేస్తున్న యువకులు, పాల్గొన్న న్యాయవాదులు

బోధన్: ప్రత్యేక జిల్లా సాధన కోసం సాగుతున్న ఉద్యమంలో యువత భాగస్వాములు కావాలని న్యాయవాదులు కోరారు. ప్రత్యేక జిల్లా కోసం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 117వ రోజుకు చేరాయి. దీక్షలో పట్టణ యువకులు నిమ్మ శ్రీనివాస్, కొలిగోట క్రిష్ణ, భిక్షపతిలు కూర్చున్నారు. న్యాయవాది గంగారెడ్డి దీక్షలను ప్రారంభించారు. ముందుగా శిబిరంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

రక్తదాన శిబిరాలు

రుద్రూర్: మోస్రా మండలం చింతకుంటలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా యువకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్, చింతకుంట యూత్ ఆధ్వర్యంలో 35 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సర్పంచ్ విమల లింగయ్య, ఉపసర్పంచ్ నాగుల స్వామి, సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, ఎంపీటీసీ రవి పాల్గొన్నారు.

బోర్గాంలో..

బోధన్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రెంజల్ మండలంలోని బోర్గాంలో హిందూ బ్లడ్ డోనర్స్ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వాణి సాయిరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. 12 మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ వైస్ చైర్మన్ అశ్వక్ అహ్మద్, కోశాధికారి రవీందర్ ఉన్నారు.

పల్లె పల్లెకు ఓబీసీ - ఇంటింటికి బీజేపీ



కేంద్రం ఓబీసీల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరిస్తున్న బీజేపీ నేతలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో పల్లె పల్లెకు ఓబీసీ ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగా రెడ్డి, సీనియర్ నాయకులు అల్జాపూర్ శ్రీనివాస్‌లు ముఖ్య అతిథులుగా హాజరై తెలంగాణలో బీసీల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వివరించారు. అలాగే కేంద్రం ప్రభుత్వం బీసీల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి, ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్, జిల్లా కార్యవర్గ సభ్యులు విజయానంద్, బొట్ల విజయ్, మిర్యాల్‌కర్ కిరణ్, పట్టణ ఉపాధ్యక్షుడు మీసాల రాజేశ్వర్, గిరిజన మోర్చా పట్టణ అధ్యక్షుడు పీర్‌సింగ్, కృష్ణ పాల్గొన్నారు.

కాంతి హైస్కూల్‌లో ఘనంగా కాన్వొకేషన్ డే



కాన్వొకేషన్ డే సందర్భంగా విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కాంతి హైస్కూల్‌లో శుక్రవారం కాన్వొకేషన్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కాంతి గంగా రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్య నుంచి పాఠశాల విద్యకు ప్రమోట్ అవుతున్న సందర్భంగా కాన్వొకేషన్ డే నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులను అన్ని రంగాల్లో నిష్ణాతులను చేయడానికి పాఠశాలలో లీడ్ పబ్లికేషన్ ద్వారా ఉత్తమమైన విద్యను అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అమెరికన్ యాక్సెంట్‌లో ఆంగ్ల భాష, ఫోనెటిక్స్ నేర్పిస్తున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు



ఆర్మూర్‌లో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత



వన్నెల్(కే)లో.. ఎంపీపీ సంతోష్‌రెడ్డి



నందిపేట: బీజేపీ ఆధ్వర్యంలో..



చౌట్‌పల్లిలో.. బీజేపీ నేత మల్లికార్జున్‌రెడ్డి

భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆయన చేసిన మేలు గురించి వక్తలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడిచి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. భారత జాతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పలు చోట్ల అన్నదానం చేశారు. రక్తదానాలు నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్



నవీపేటలో..



నాళేశ్వర్‌లో .. గ్రామస్తులు



పెంటాకుర్దులో .. గ్రామస్తులు



వర్నిలో .. మైనార్టీ నాయకులు



బోధన్‌లో సాయి ఆదర్శ మండలి ఆధ్వర్యంలో..



మెండోరా మండలం సోన్‌పేట్‌లో..



సాలూర మండలంలోని ఖాజాపూర్‌లో..



మాక్లూర్ మండలం మాదాపూర్‌లో ..



కమ్మర్‌పల్లిలో .. ఏఐవైఎస్ నాయకులు

అంబేడ్కర్, బుద్ధుడి విగ్రహాల ఆవిష్కరణ



పూలమాల వేస్తున్న కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్): బ్రాహ్మణపల్లిలో బీఆర్ అంబేడ్కర్, గౌతమ బుద్ధుడి విగ్రహాలను శుక్రవారం కాంగ్రెస్ నేత కెప్టెన్ కరుణాకర్ రెడ్డి ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని కరుణాకర్ రెడ్డి తన సొంత నిధులతో గ్రామంలో ఏర్పాటు చేయగా.. ఏఆర్పీ క్యాంప్ గ్రామానికి చెందిన సూర్యకాంత్, గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కెప్టెన్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గౌతమ బుద్ధుడి బోధనలు, సూక్తులు అంబేడ్కర్‌కు భారత రాజ్యాంగం రచించడంలో ఉపయోగపడ్డాయని వ్యాఖ్యానించారు. అనంతరం విగ్రహ దాతలను గ్రామస్తులు సన్మానించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ రజిత యాదవ్, సర్పంచ్ లక్ష్మి, మాజీ ఎంపీటీసీ ప్రమీల, మాజీ ఎంపీపీ భాస్కర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

రమణ మహర్షి బోధనలు ఆదర్శం



మాట్లాడుతున్న విరజానంద స్వాములు



పాల్గొన్న భక్తులు

బాల్కొండ: తత్వవేత్త రమణ మహర్షి బోధనలు ఆదర్శమని శివ రామ కృష్ణ తపోవనం పీఠాధిపతులు విరజానంద స్వామి అన్నారు. శుక్రవారం కిసాన్‌నగర్‌లోని గీతాశ్రమంలో రమణ మహర్షి 72వ ఆధార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం ఆయన చేసిన బోధనలు ఎప్పటికి అనుసరణీయమన్నారు. మానవ జీవన విధానంలో ఆయన విధానాలు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

అంబేడ్కర్ ఆశయాల దిశగా యువత పయనించాలి



నివాళులర్పిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి తదితరులు

బోధన్‌టౌన్(బోధన్): భారత రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆరాధ్యదైవం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల దిశగా యువత పయనించి దేశాభివృద్ధికి పాటు పడాలని ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ 132వ జయంతిని పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, ఆచన్‌పల్లి చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలో బీజేపీ, హిందువాహిని, టీజీవీపీ, ఆదర్శ మహిళా మండలి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు.

బోధన్‌లో ప్రభుత్వ ఇఫ్తార్ విందు



బోధన్ టౌన్(బోధన్): రంజాన్ పండుగను పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని షఫీ చమాన్‌లో తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆదేశాల మేరకు అధికారిక ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆర్డీవో రాజేశ్వర్ హాజరయ్యారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. విందులో ఏసీపీ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, తహసీల్దార్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ ఎత్తేషాం, కౌన్సిలర్ గంగారాం పాల్గొన్నారు.